క్లుప్తంగా

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



జంపెన వాసవీమాతకు పూజలు చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: జంపెనలో వాసవీమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టా మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసవీ మాత మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి. రాధ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికిగాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందవచ్చునన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ తదితర జనరల్ కోర్సులు, ఓఎస్, ఏఈటీ, ఈటీ, సీఎస్ఈ తదితర ఒకేషనల్ కోర్సులు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అనివార్య కారణాలతో ఇంటర్ మధ్యలో ఆపేసిన విద్యార్థులు మరలా ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరవచ్చునన్నారు. ఇటీవల పరీక్షల్లో తమ కళాశాల విద్యార్థులు సిహెచ్. సాయి దివ్య (బైపీసీ–968), జె. ఫిరోదోస్(బైపీసీ–959), పి. హేమలత(ఎంపీసీ–890) అత్యధికంగా మార్కులు సాధించారన్నారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

మాకవరపాలెం: వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో మరింత విజ్ఞానం పెంపొందుతుందని హెచ్ఎం కె.రాము అన్నారు. విద్యా శాఖ ఆదేశాలతో చేపట్టిన వేసవి శిబిరాల్లో భాగంగా తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఆంగ్లం, గణితం, చిత్రలేఖనం, కథలు, ఆంగ్ల వాక్యాలు, తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనం, గణితంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ వేసవి శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. ప్రధానంగా వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి పాల్గొన్నారు.

89 మందికి వైద్య పరీక్షలు



బీపీ పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్య సిబ్బంది వచ్చి వైద్యం అందిస్తున్నట్లు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. శుక్రవారం పైడంపేటలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 89 మందికి వైద్యం అందించడంతోపాటు 26 మందికి బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. పోషక విలువలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రసవాలను ప్రభుత్వాస్పత్రుల్లోనే చేసుకోవడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యం క్షేమదాయకమని వివరించారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్. రాజు, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఆశ కార్యకర్త ధనలక్ష్మి పాల్గొన్నారు.

జోరుగా చెరకు నాట్లు



చెరకు నాట్లు వేస్తున్న పెదగోగాడ రైతులు

చీడికాడ: మండలంలో మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలతో మెట్ట గ్రామాలైన అర్జునగిరి, పెదగోగాడ, చెట్టుపల్లి, చుక్కపల్లిలో చెరకు నాట్లు జోరుగా సాగుతున్నాయి. దీంతో కూలీలకు, చెరకు విత్తన తోటలకు డిమాండ్ ఏర్పడింది. ఉపాధి పనులు చేస్తుండడంతో వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాన్ని ఉపాధి హామీ పథకంతో అనుసంధానిస్తే మేలు కలుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వేసవి దుక్కులు.. సాగు బాగు

- చీడపీడలు, కలుపు నివారణకు దోహదం
- లోతుగా దున్నితే అధిక దిగుబడులు



పి.పి.అగ్రహారంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు

మాకవరపాలెం: వేసవిలో పొలాలను దున్నుకోవడంతో కలుపు, చీడపురుగులు నశిస్తాయి. పొలం కూడా మెత్తబడి అధిక దిగుబడి పొందవచ్చు. ప్రస్తుతం పొలాల్లో ఎలాంటి పంటలు లేనందున లోతుగా దుక్కులు దున్నుకుంటే ఏ పంట వేసినా అధిక దిగుబడి ఎక్కువగా సాధించవచ్చని అధికారులు చెబుతున్నారు. దీంతో గ్రామాల్లోని పొలాల్లో దున్నడం ప్రారంభించి వానకాలానికి సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలను వినియోగిస్తూ అధికారుల సూచనలతో పంటలు సాగు చేస్తే వ్యవసాయం మంచి లాభసాటిగా మారుతుందని చెబుతున్నారు. వేసవిలో లోతుగా దుక్కులు దున్ని తొలకరి జల్లులు కురిసిన తర్వాత సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. నేల అధికంగా నీటిని పీల్చుకుంటుంది.

దుక్కులు లోతుగా దున్నుకోవాలి

మాకవరపాలెం మండలంలో ఏటా ఖరీఫ్‌లో 1,400 హెక్టార్ల వరకు రైతులు వరిసాగు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వేసవి దుక్కులు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పి.పి అగ్రహారం, కొండల అగ్రహారం, బూరుగుపాలెం, పైడిపాల, మాకవరపాలెం, రాచపల్లి, జంగాలపల్లి ప్రాంతాల్లో రెండు రోజులుగా వేసవి దుక్కులు చేస్తున్నారు. ఈ దుక్కులు కారణంగా భూమి గుల్లబారడంతోపాటు నేల పొరలు పై నుంచి కిందకు తిరిగబడి భూ సారం పెరుగుతుంది. అంతే కాకుండా క్రిమి కీటకాలు మరణించి, కలుపును నివారించేందుకు ఉపయోగపడుతుంది. తొలకరి వర్షాలు పడిన వెంటనే నీరు పల్లం వైపు పార్లకుండా ఎక్కడికక్కడే పొలంలోనే ఇంకిపోతుంది. భూమికి ఎక్కువ రోజులు తేమ నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీనివల్ల పైరు వేసిన తర్వాత వర్షాలు పడటం కొద్దిగా ఆలస్యమైనా పంటకు నష్టం జరగదు.

మొండిజాతి కలుపు నివారణ

పొలాల్లో వేసవి దుక్కులు దున్నినప్పుడు కలుపు మొక్కలు, కాయలు, వేర్లు, దుంపలు పెకిలించబడి వేసవిలో ఉండే ఉష్ణోగ్రతలకు అవి నశించడానికి ఆస్కారం ఉంటుంది.

దుక్కి దున్నిన తర్వాత నేలపైకి తేలిన కాయలు, దుంపలు ఏరివేసుకుంటే పొలం శుభ్రంగా తయారవుతుంది. తుంగ, గరిక, గుంజర వంటి మొండిజాతి కలుపు మొక్కలు పొలంలో అధికంగా పెరిగి పంటలను నాశనం చేస్తుంటాయి. వేసవి దుక్కులు లోతుగా తీయడంతో పొలంలోని చీడలు నాశనమయ్యే అవకాశమున్నందున రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

ఆహారపు అలవాట్ల మార్పులతో రక్తపోటు నివారణ



కె.జె.పురం పీహెచ్‌సీ సిబ్బందితో ప్రమాణం చేయిస్తున్న వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు



శంకరంలో అవగాహన కల్పిస్తున్న ఏఎన్ఎం రాణి

మాడుగుల రూరల్: జాతీయ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని కె.జె.పురం పీహెచ్‌సీలో శుక్రవారం అధిక రక్తపోటు వల్ల వచ్చే అనర్థాలు గురించి రోగులకు అవగాహన కల్పించారు. ప్రధాన వైద్యాధికారి ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు మాట్లాడుతు హైబీపీ తక్కువ అంచనా వేయొద్దన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే ఒక్కొక్క సారి ప్రాణానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. తలనొప్పి, చాతినొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరగడం, వికారం, వాంతులతోపాటు కళ్లు మసకబారడం, ఆందోళనగా ఉండటం, చెవుల్లో శబ్దాలు వంటివి అధిక రక్తపోటుకు సూచనలు అని వివరించారు. ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని సూచించారు. వ్యాయామం, ఆహారంలో ఉప్పు, కారాల్ని తగ్గించడంతోపాటు మద్యం, ధూమపానం ఆపివెయ్యడం వంటివి అధిక రక్తపోటు నియంత్రణలో ఉపకరిస్తాయన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలతో రక్తపోటు నివారణ కోసం ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామని ప్రమాణం చేయించారు. సీహెచ్‌వో సిహెచ్. పుష్పమ్మ పాల్గొన్నారు. శంకరంలో ప్రజలకు అధిక రక్తపోటు వల్ల వచ్చే అనర్థాలు గురించి ఏఎన్ఎం రాణి అవగాహన కల్పించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా, దోమల నివారణపై అవగాహన కల్పించారు.

మురుగు నిల్వలు లేకుండా జాగ్రత్తలు



గుల్లేపల్లిలో ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా చూడాలని ప్రజలకు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రజలకు దోమకాటు వల్ల వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఖాళీ టైర్లు, రుబ్బురోళ్లు, నీటి తొట్టెలలో వారం రోజుల కన్నా ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉండే నీటిని తొలగించాలని సూచించారు. మురుగునీటిని తొలగించకపోతే దోమలు చేరి లార్వాను విడలడం వల్ల దోమ వృద్ధి చెందుతుందన్నారు. తద్వారా దోమకాటుతో ప్రమాదకర డెంగ్యూ, మలేరియా వ్యాధుల బారిన పడతారన్నారు. ఈ నేపథ్యంలో మురుగునీటిని తొలగించడం వల్ల ఈ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్. రాజు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవాలకు చిటుకు వ్యాధి నివారణ టీకాలు



ఎ.కోడూరులో ఈటీ వ్యాక్సిన్లను చేస్తున్న పశువైద్య సహాయకుడు సాయికుమార్

కె.కోటపాడు: వర్షాకాలం సమయాల్లో గొర్రెలు, మేకలకు చిటుకు వ్యాధి సోకకుండా ఉండేందుకు పెంపకందారులు తప్పనిసరిగా ఎంట్రో టాక్సీమియా(ఈటీ) వ్యాక్సిన్‌ను వేయించాలని పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ తెలిపారు. శుక్రవారం ఎ.కోడూరులో 120 గొర్రెలు, మేకలకు ఈటీ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ మూడు నుంచి ఆర్నెల్ల వయస్సు గల గొర్రెలు, మేకలు ఈ వ్యాధి బారిన పడే పరిస్థితి ఉందన్నారు. గొర్రెలు, మేకలు పారుకోవడం వల్ల నీరసించిపోయి మరణిస్తాయని రైతులకు వివరించారు. ఈ నేపథ్యంలో వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా పశు సంవర్థకశాఖ ద్వారా ఉచితంగా ఈటీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెలాఖరు వరకూ నిర్వహిస్తామన్నారు.

రేపటి నుంచి రెండో విడత చందనం అరగదీత

అనకాపల్లి: స్థానిక గవరపాలెం కొబ్బరితోటలో వేంచేసిన శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి వారికి రెండవ విడత చందనం అరగదీత కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 22 వరకు ఆలయ ఆవరణలో చందనం అరగదీత, 23న వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున స్వామికి రెండో విడత చందన సమర్పణ జరుగుతుందన్నారు. చందన అరగతీత కార్యక్రమంలో పాల్గొనే భక్తులు 8121316268 నంబరును సంప్రదించాలని కోరారు.

నేడు కన్యకాపరమేశ్వరి జయంతి మహోత్సవం



అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ తెలిపారు. ఆలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజాము 5 గంటలకు అమ్మవారి పల్లకీ ఊరేగింపు, నిత్య ప్రార్థనలు, గోపూజ, శ్రీ నగరేశ్వర స్వామి, శ్రీ జనార్దన స్వామివార్లకు అభిషేకాలు, అమ్మవారి ఉత్సవమూర్తికి భక్తులచే ఆలయ ముఖ మండపంలో ధాన్యాభిషేకం, లక్ష మల్లెలతో అర్చన, సామూహిక లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం పేద మహిళలకు చీరల పంపిణీ, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం 102 రకాల స్వీట్లతో అమ్మవారికి నివేదన, ఊంజల్ సేవ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఆలయ కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వర రావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

23న బుద్ధ జయంతి వేడుకలు

అనకాపల్లి: మండలంలోని శంకరం పంచాయతీ పరిధి బొజ్జన్నకొండ వద్ద ఈ నెల 23న బుద్ధ జయంతి(బుద్ధ పూర్ణిమ) వేడుకలు నిర్వహించనున్నట్లు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 22 వరకు విద్యార్థులకు బొజ్జన్న కొండ చరిత్ర, విశిష్టతపై జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు జరపనున్నట్లు పేర్కొన్నారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొనే విద్యార్థులు నాలుగు పేజీలకు మించకుండా తెలుగులో రాసిన వ్యాసాలను నేరుగా వాట్సప్ 89770 20615, 94932 56300 నంబర్లకు పంపించాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 23న బొజ్జన్నకొండ వద్ద బహుమతులు అందిస్తామన్నారు.

మోదమ్మ ఆలయ సింహద్వారం ప్రారంభం



మోదకొండమ్మతల్లి ఆలయంలో సింహద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయ సింహద్వారాన్ని శుక్రవారం ఆలయ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. సింహద్వారం నిర్మాణానికి ఆర్థికసాయం చేసిన యూనివర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ మీసాల దుర్గాప్రసాద్‌ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించి సత్కరించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహచలంనాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి రామారావు, ప్రసాద్‌నాయుడు, వెంకటరమణ, శ్రీను, రాజబాబు, వెంకటరత్నం పాల్గొన్నారు.

వారపు సంత షెడ్‌ల నిర్మాణానికి స్థల పరిశీలన

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో వ్యాపారుల సౌకర్యం కోసం షెడ్‌ల నిర్మాణానికి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. నాబార్డు, పంచాయతీ నిధులతో చిరు వ్యాపారుల కోసం రెండు షెడ్‌లు, రెండు టాయిలెట్లను నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

వ్యాయామంతో పలు రోగాలు దూరం



తుమ్మపాల పీహెచ్‌సీలో రోగికి బీపీ చెక్ చేస్తున్న వైద్యురాలు

అనకాపల్లి: నిత్యం వ్యాయామంతో పలు వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు వాణీజగదీశ్వరి అన్నారు. మండలంలోని తుమ్మపాల పీహెచ్‌సీలో ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఏడాదికి కనీసం మూడుసార్లు రక్త పరీక్షలు చేసుకోవాలన్నారు. రోజూ తీసుకునే ఆహారంలో 1.5 గ్రాముల కంటే తక్కువగా ఉప్పు తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. బీపీ ఎక్కువగా ఉన్న రోగులు ఎప్పటికప్పుడు రక్తపరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు. అధిక బీపీ వల్ల గుండె, కిడ్నీ, లివర్ వంటి అవయవాలు పాడవడమే కాకుండా కంటి సమస్యలు బాధిస్తాయన్నారు. మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



పాల్గొన్న భక్తులు

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లో కొలువైన అలివేలు మంగమ్మ సన్నిధిలో ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి కుంకుమార్చనలు చేశారు. అనంతరం శ్రీవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రసాద వితరణ చేపట్టారు.

ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకు కోడ్ అమలు



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎస్ఐ రామారావు

నాతవరం: ఓట్లు లెక్కింపు పూర్తయ్యేంత వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, ఎస్ఐ రామారావు తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో వారు సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 4న ఓట్లు లెక్కింపు నిర్వహిస్తారన్నారు. అంతవరకు మండల వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులకు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఓట్లు లెక్కింపు రోజున గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టామన్నారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల ప్రకారం గ్రామాల్లో పార్టీలు గెలుపోటములపై పందేలు, బెట్టింగ్‌లు వేయొద్దన్నారు. ఎక్కడైనా పందేలు వేస్తున్నట్లుగా తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కొన్ని గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కవ్వింపులు చర్యలకు పాల్పడుతున్నట్లుగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి గ్రామాల్లో పోలీసులు నిఘా పెట్టామన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పోలీసు గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నంత వరకు పార్టీ జెండాలు, కటౌట్లు పెట్టరాదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, సీనియర్ అసిస్టెంటు కృష్ణ, ఆర్ఐ హరి, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు లక్ష్యానికి మించి పని

- ఎంపీడీవో జాగరపు రాంబాబు



ఉపాధి కూలీల మస్టర్ పరిశీలిస్తున్న ఎంపీడీవో జాగరపు రాంబాబు

నాతవరం: ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలందరికీ ఏప్రిల్ నుంచి రోజు ఒక్కంటికి రూ.300 ప్రభుత్వం చెల్లిస్తుందని ఎంపీడీవో జాగారపు రాంబాబు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పని చేస్తున్న కూలీలు మస్టర్లను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. నిబంధనలు ప్రకారం పనులు చేస్తున్నారా లేదా ఏమైనా లోపాలు ఉన్నాయా అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వేతనదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మస్టర్ రిజిస్టరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు,. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో అధికంగా ఉపాధి పనులు కల్పించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. రోజు ఒక్కంటికి 12 వేల మందికి పైగా ఉపాధి పని కల్పించాలన్నారు. ప్రస్తుతం రోజు ఒక్కంటికి 11 వేలకు పైగా కూలీలు పని చేస్తున్నారన్నారు. లక్ష్యాన్ని అధిగమించేందుకు అధికారులు దృష్టి సారించాలన్నారు. ఇంతవరకు పని చేసిన కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లింపులు చేశామన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో కూలీలకు ఓఆర్ ప్యాకెట్లు, తాగునీరు అందిస్తున్నామన్నారు. వేసవి ఉన్నంతవరకు కూలీలు సమయపాలన విధిగా పాటించాలన్నారు. ఏపీవో చిన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన కొమరవోలు తల్లి ఉత్సవాలు



ఉత్సవంలో ఆకట్టుకున్న శక్తి నృత్యం



మైదాన చెరువు సమీపంలో బాణసంచా కాల్పులు



విద్యుత్ అలంకరణలో కొమరవోలు వీధులు



కొమరవోలు తల్లి ఉత్సవంలో భక్త జనం

- జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న నేల డ్యాన్సులు

రోలుగుంట: కొమరవోలు తల్లి ఉత్సవాలు గురువారం రాత్రి వైభవంగా ముగిశాయి. కొమరవోలులో ఈ నెల 12న ప్రారంభమైన గ్రామ దేవత ఉత్సవాలు ప్రతి మూడేళ్లకొకసారి నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా గ్రామంలో ఆవల గంగాదేవి ఆలయం వద్ద అమ్మవారి ఉత్సవాన్ని మత్స్యకార కుటుంబాల వారు జరుపుకున్నారు. ఈ నెల 14న ఇటంశెట్టి వారి కళ్లాలు వద్ద పండగ నిర్వహించారు. ముగింపు రోజున ఇలవేల్పు కొమరవోలు తల్లి పండగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా విద్యుత్ దీపాలతో వీధులు అలంకరించారు. రహదారికి ఇరువైపులా ప్రధాన కూడలి వద్ద ప్రదర్శించిన దేవతామూర్తులు విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంది. ఊరేగింపులో శక్తి డ్యాన్సులు, యువకుల నృత్యాలు విశేషంగా అలరించాయి. ఆకాశం మిరుమిట్లు గొలిపేలా భారీ బాణసంచా కాల్చారు. ఉత్సవ కమిటీ చైర్మన్ గొర్లె చెల్లం నాయుడు, ఎంపీటీసీ సభ్యులు గొర్లె వెంకటరమణ, బోశం దొరబాబు సారధ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఉత్సవం సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

హెచ్ఎంలపై చర్యల ఉపసంహరణకు వినతి

అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పనుల్లో జాప్యం పేరిట జిల్లా వ్యాప్తంగా 227 మంది హెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం ఆక్షేపణీయమని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ అన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మను కార్యాలయంలో కలిసి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ ఏడాది మార్చి నెలలో నిధులు జమచేసి, మే నెల రెండో వారంలోగా పనులు పూర్తి చేయలేదని నోటీసులివ్వడం సరికాదన్నారు. మార్చి నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులు అనేక పనుల్లో నిమగ్నమయ్యారని, ఈ రెండు నెలల కాలంలో టెన్త్ పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్లు, సార్వత్రిక ఎన్నికల శిక్షణ, ఎన్నికల విధుల్లో తలమునకలై ఉన్నారని తెలిపారు. చర్యల్ని ఉపసంహరించుకోవాలని వినతిపత్రంలో కోరారు. డీఈవోను కలిసిన వారిలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి జోగా రాజేష్, సీనియర్ నాయకులు చిట్టియ్య, బాబూరావు, సతీష్, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న వేగి నాగేశ్వరరావు, అనురాధ దంపతులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పార్క్ సెంటర్ గౌరీ పంచాయతన దేవాలయంలో శుక్రవారం శ్రీ గౌరీపరమేశ్వరుల 192వ ఊంజల్ సేవ ఘనంగా నిర్వహించారు. స్థానిక వ్యాపారవేత్త వేగి నాగేశ్వరరావు, అనురాధ దంపతులచే ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయిలు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం గౌరీ గీతా మహిళా మండలి, గౌరీ పరమేశ్వరి అమృతవర్షిణి వ్యవస్థాపకులు పెతకంశెట్టి సుజాత ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.